క్లుప్తంగా...

పోస్టర్ ఆవిష్కరణ



కల్వకుంట్ల కవితతో పోస్టర్ విడుదల చేయిస్తున్న పుప్పాల రాధాకృష్ణ

చార్మినార్: ఈసారి బతుకమ్మ దాండియా ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామని.. ఇందులో భాగంగా బతుకమ్మ దాండియా ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో విడుదల చేయించినట్లు భారత జాగృతి హైదరాబాద్ సిటీ ఉపాధ్యక్షుడు పుప్పాల రాధాకృష్ణ తెలిపారు. 21న సాగర్ రింగ్ రోడ్డులోని ఈదుల కంటి రాంరెడ్డి గార్డెన్స్‌లో జరిగే ఉత్సవాలకు కవితను ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. ప్రతినిధులు రూపేష్, వికాస్, సుశాంత్, వినయ్, దినేష్, శైలేందర్ తదితరులతో కలిసి గురువారం పోస్టర్‌ను ఆవిష్కరింప చేశారు.

మహేష్‌యాదవ్‌కు సన్మానం



అబిడ్స్: నగరానికి వచ్చిన ఆల్‌ఇండియా యాదవ మహాసభ అధ్యక్షుడు మహేష్‌యాదవ్‌ను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్ ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..యాదవ కులస్థుల సంక్షేమానికి యాదవ మహాసభ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వాల దృష్టికి యాదవ కులస్థుల సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ముందుంటామన్నారు.

'బంగారు బతుకమ్మ' పాటల ఆవిష్కరణ



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ పండుగకు ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చిందని బీఆర్ఎస్ పార్టీ మహారాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ శుక్లా అన్నారు. గురువారం రవీంద్రభారతిలో ప్రముఖ గాయని కవిత చక్ర స్వీయా రచనా సంగీత సారథ్యంలో రూపొందిన 'బంగారు బతుకమ్మ' పాటలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ..బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, పలువురు గాయనీ గాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం



అబిడ్స్: రహీంపురాలో జరిగే బతుకమ్మ, దాండియా వేడుకలకు రావాలని ఎమ్మెల్సీ కవితకు మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 18న రహీంపురా ప్లే గ్రౌండ్‌లో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దాండియా, బతుకమ్మ వేడుకలు పెద్ద ఎత్తున చేపడుతామన్నారు.

ఘన నివాళి



చాంద్రాయణగుట్ట: బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు దావ కళమ్మ దశ దినకర్మ గురువారం ఉప్పుగూడలో జరిగింది. బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇచ్చారు.

జీఎన్ఐటీఎస్‌లో వరల్డ్ మెంటల్ హెల్త్ డే

గోల్కొండ: ఫిక్స్‌డ్ మైండ్ సెట్ నుంచి గోల్ మైండ్ సెట్ కోసం ప్రయత్నించే వ్యక్తులు తమ శక్తియుక్తులను సంపూర్ణంగా వినియోగించుకుంటారని ప్రముఖ సైకాలజిస్టు విశేష్ అన్నారు. గురువారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మైండ్ సెట్ మ్యాటర్స్-అన్‌లాకింగ్ యువర్ పోటెన్షియల్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరల్డ్ మెంటల్ హెల్త్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కౌన్సెలింగ్ కమిటీ కన్వీనర్ వి.జాహ్నవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.ఎస్.ఎల్.నర్సింహా, మెడికల్ కమిటీ కన్వీనర్ పి.వి.రామ్మోహన్‌రెడ్డి, సూర్యకుమారి, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ 2023

80 ఏళ్ల వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం



ఓటర్ల జాబితాల పనిలో నిమగ్నమైన అధికారులు, సిబ్బంది

నాంపల్లి: 80 ఏళ్లు పైబడిన ఓటర్లకు కేంద్ర ఎన్నికల కమిషన్ తీపి కబురు అందించింది. నవంబరు 30న జరిగే ఎన్నికల్లో వీరు పోలింగ్ బూత్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా గంటల తరబడి క్యూలో నిల్చోకుండా ఇంటి వద్ద నుంచే ఓటు వేసుకునే వెసులుబాటును కల్పించింది. బీఎల్‌ఓల ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఓటును ఇంటి నుంచే వేసుకోవచ్చునని 63-నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఉప్పల లావణ్య పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన సందర్భంగా ఆమె గురువారం ఆర్‌ఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గం వ్యాప్తంగా 277 పోలింగ్ బూతులు ఉన్నట్లు చెప్పారు. వీటిలో 68 సమస్యాత్మకమైన పోలింగ్ బూతులు ఉన్నాయని వివరించారు. అక్కడ కట్టుదిట్టమైన భద్రతా బలగాలు, బందోబస్తు ఉంటుందని, ఓటర్లు ప్రశాతంగా ఓటు వేసుకునే అవకాశాన్ని కల్పిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను జియో ట్యాగ్‌తో ఎప్పటికప్పుడు సమీక్షించి తగు చర్యలు చేపడతామని తెలిపారు. అన్ని పోలింగ్ బూతులను ఇప్పటికే సందర్శించామని, అక్కడక్కడా నెలకొన్న మౌలిక సదుపాయాల లేమిని త్వరలోనే పూర్తి చేస్తామని, ఆ దిశగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. 63-నియోజకవర్గంలో రెడ్‌హిల్స్, మల్లేపల్లి, విజయనగర్ కాలనీ, మురాద్‌నగర్, ఆసిఫ్‌నగర్, గుడిమల్కాపూర్, మెహిదీపట్నం, అహ్మద్‌నగర్ డివిజన్లు ఉన్నాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నాటి నుంచి బరిలో నిల్చునే అభ్యర్థులను ప్రకటించే వరకు ఆర్‌ఓ కార్యాలయం వద్ద వంద మీటర్ల మేర 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థుల నామినేషన్లను విజయనగర్ కాలనీలోని ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో స్వీకరిస్తారని తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటుగా మరో ఇద్దరినే కార్యాలయంలోనికి అనుమతి ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలో జరిగే ఎన్నికల పరిశీలనకు ఆరు వాహనాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

అధికారుల ఫోన్ నంబర్లు..

ఆర్‌ఓ-లావణ్య	-9440815856
ఈఆర్‌ఓ-ఆంజనేయులు	-8008103667
ఏఆర్‌ఓ-జ్యోతి	-9440815873
ఏఈఆర్‌ఓ-కృష్ణమూర్తి	-9121243819
ఏఈఆర్‌ఓ-నర్సింగ్	-7995007419

ఓటర్ల వివరాలు..

పురుషులు-165767
మహిళలు-155383
థర్డ్ జెండర్-10

దివ్యాంగులు..
పురుషులు-704
మహిళలు-442

ఎన్ఆర్ఐ ఓటర్లు..
పురుషులు-77
మహిళలు-12

సర్వీసు ఓటర్లు..
పురుషులు-25
మహిళలు-02

గోషామహల్ కాంగ్రెస్‌లో గందరగోళం



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్‌లో రచ్చ కొనసాగుతోంది. పార్టీ అభ్యర్థి పేరు స్థానికేతరులకు ప్రకటిస్తామని ప్రచారం కావడంతో స్థానికంగా పోటీపడుతున్న పలువురు నాయకులు ఆందోళనకు దిగుతున్నారు. గతంలో 30 ఏళ్ల పాటు గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. మాజీ దివంగత రాష్ట్రమంత్రి ముఖేష్‌గౌడ్ నూరు పర్యాయాలు ఎమ్మెల్యేగా, రెండుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ కంచుకోట అయిన ఈ నియోజకవర్గం 2014లో, 2019లో బీజేపీ అభ్యర్థిగా రాజాసింగ్ గెలుపొందారు. కాగా కాంగ్రెస్ పార్టీకి టికెట్ ఆశించేవారి సంఖ్య పదిమందికి పైగా పెరిగిపోయారు. ఎన్నికల షెడ్యూల్ రావడంతో కాంగ్రెస్ టికెట్‌కై ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా 2004 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీచేసిన మధుసుధన్‌గుప్తాతో పాటు రాష్ట్ర ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్, దళిత సామాజిక వర్గానికి చెందిన సి.కె.మూర్తి, ఇతర నాయకులు నిర్మల్‌కుమార్‌యాదవ్, గోకరణ్‌సింగ్, సంజయ్ యాదవ్, ప్రేమ్‌లాల్‌తో పాటు పలువురు నాయకులు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన సునితరావుకు టికెట్ వస్తుందని ప్రచారం కావడంతో అందరూ భగ్గుమంటున్నారు.

గాంధీభవన్ ముందు ధర్నా..

సునితా రావుకు టికెట్ ఇవ్వొద్దని స్థానికులకే టికెట్ ఇవ్వాలని పలువురు నాయకులు గాంధీభవన్ ముందు ధర్నాకు దిగారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన సునితరావుకు టికెట్ ఇస్తే తామెక్కడ పోవాలని ప్లకార్డులు ప్రదర్శించి ఆందోళన చేశారు. ఏకంగా ఇద్దరు అభ్యర్థులు సికే.మూర్తి, మెట్టు సాయికుమార్‌లు ఢిల్లీ స్థాయిలో టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

పెరిగిన పోటీతత్వం..

కాంగ్రెస్ టికెట్‌కు పోటీతత్వం పెరిగింది. 50కి పైగా దళిత బస్తీలు ఉండడంతో దళితుడికే టికెట్ ఇవ్వాలని సీకే.మూర్తి జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్రరాష్ట్ర దళిత నాయకుల మద్దతు తీసుకుంటున్నారు. 20 ఏళ్ల కింద ఆసిఫ్‌నగర్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన మధుసుదన్‌గుప్తా ఆర్యవైశ్యులకే టికెట్ ఇవ్వాలని జాతీయ స్థాయిలో ఆర్యవైశ్యుల మద్దతు పొందుతున్నారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు ఒక్కరికైనా టికెట్ ఇవ్వాలని ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పటికి గాంధీభవన్‌లో రోజూ ఉంటూ కాంగ్రెస్ ఆందోళనలలో చురుకైన పాత్ర పోషించిన మెట్టు సాయికుమార్ తనకే టికెట్ ఇవ్వాలని ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో గోషామహల్ కాంగ్రెస్ టికెట్‌కై ఢిల్లీ స్థాయిలో కూడా పైరవీలు కొనసాగుతున్నాయి.

బతుకమ్మకు అన్ని ఏర్పాట్లు చేశాం



కార్వాన్ వద్ద మహిళలతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: బతుకమ్మ పండగకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన మోహినీ ఫంక్షన్ హాల్ వద్ద స్థానిక మహిళలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని అయితే ఎన్నికల కోడ్ కారణంగా చీరల పంపిణీని నిలిపివేశారన్నారు. అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే వీలు లేకుండా ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. అయితే తాను ముందుగానే కార్వాన్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో పర్యటించానన్నారు. బతుకమ్మ ఆడే ప్రదేశాలను శుభ్రం చేయడం జరిగిందని చౌరస్తాలు, తదితర వాటిని బతుకమ్మ కోసం సిద్ధం చేశామని ఆయన అన్నారు. బతుకమ్మ నిమజ్జనానికి అవసరమైతే తాత్కాలిక వాటర్ పాండ్స్ ఏర్పాటు చేయిస్తానని ఆయన అన్నారు. బతుకమ్మల నిమజ్జనంలో ఏవైనా ఆటంకాలు వస్తే నేరుగా తనకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, బదరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

చార్మినార్ వద్ద 'స్వచ్ఛత హీ సేవా'



చార్మినార్: జాతీయ గణాంక, పథకాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ నేషనల్ శాంపిల్ సర్వే కార్యాలయం అధికారులు, సిబ్బంది స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం చార్మినార్ వద్ద వీధులు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సతీష్, డిప్యూటీ డైరెక్టర్ శివ పార్వతిరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ బర్కత్‌అలీ, జయరాం పాల్గొన్నారు.

సంక్షేమాన్ని పట్టించుకునే సెక్యులర్ నాయకులనే ఎన్నుకోవాలి



సమావేశంలో ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ప్రతినిధులు

చార్మినార్: అభివృద్ధిని ఆశించి ప్రజల సంక్షేమాన్ని పట్టించుకునే సెక్యులర్ నాయకులనే ఈ ఎన్నికల్లో ఎన్నుకోవాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పిలుపునిచ్చారు. కుల మతాలకు అతీతంగా పని చేసే పార్టీలకే ప్రాధాన్యమివ్వాలన్నారు. ఎంపీజే ఆఫీస్ బేరర్ల సమావేశంలో పురానీహవేలీలోని కార్యాలయంలో గురువారం జరిగింది. రాబోయే పోలింగ్ సందర్భంగా సంస్థ ప్రతినిధులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ప్రతి ఓటరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో ఓటు శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే ప్రధాన కార్యదర్శి సలీం అల్ హింది, సంయుక్త కార్యదర్శి షేక్ ఖాసీం, కోశాధికారి షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం అద్దాలు పగులగొట్టిన వ్యక్తికి జైలు

గౌలిపురా: ఏటీఎం అద్దాలు పగులగొట్టి పాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు స్టేషన్‌లో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిని నాంపల్లి 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ కె.లలిత 12 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ నూరీ ఫంక్షన్ హాల్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అమేర్ (25) ఏటీఎం కేంద్రం అద్దాలను పగలగొట్టడంతో స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీంతో అమేర్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు స్టేషన్‌లో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో పోలీసులు అమేర్‌పై కేసు నమోదు చేసుకొని గురువారం కోర్టులో హాజరుపర్చగా పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ లలిత అమేర్‌కు 12 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

సునందకు జాతీయ సేవా రత్న అవార్డు



సునందకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న నల్లా రాధాకృష్ణ

గోల్కొండ: దళిత మహిళల్లో రాజకీయ చైతన్యం తెచ్చేందుకు లంగర్‌హౌజ్‌కు చెందిన టి.సునంద ఎంతగానో కృషి చేస్తున్నారని బహుజన సాహిత్య అకాడమీ చైర్మన్, అవార్డు సెలక్షన్ కమిటీ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అన్నారు. తెరుపల్లి సునందకు సేవా రత్న నేషనల్ అవార్డుకు ఎంపిక చేసిన సందర్భంగా గురువారం ఆమెకు బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో అవార్డు స్వీకరించడానికి రమ్మని కోరుతూ ఆయన ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం.గౌతమ్, రాష్ట్ర కార్యదర్శి కనుకుంట్ల విజయ్‌కుమార్ తదితరులున్నారు.

ప్రయాణికులకు టీఎస్‌ఆర్టీసీ శుభవార్త

అఫ్జల్‌గంజ్: ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శుభవార్త తెలిపింది. దసరా పండగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు రూ.11 లక్షల నగదు బహుమతులు గెలుపొందే అవకాశం కల్పించింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారు టికెట్ వెనుకాల తమ పేరు, ఫోన్ నెంబర్ రాసి బస్టాండులో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్సులో వేయాలని తెలిపారు. ఈనెల 21 నుంచి 23 వరకు మళ్లీ 28 నుంచి 30వ తేదీల వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రీజియన్‌లో లక్కీ డ్రా నిర్వహించి 10 మంది చొప్పున ఎంపిక చేస్తారని తెలిపారు. 11 రీజియన్‌లల్లో కలిపి మొత్తం 110 మందికి ఒక్కొక్కరికి రూ.9900 చొప్పున నగదు బహుమతులు ఇస్తామన్నారు. బతుకమ్మ, దసరా పండుగల కోసం దాదాపు 5265 ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచామన్నారు. దసరా, దీపావళి, క్రిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు తమతో పాటు తీసుకువచ్చే లగేజ్ ఫేర్‌లో 20 శాతం డిస్కౌంట్‌ను ప్రకటించారు.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్టు

విజయనగర్‌కాలనీ: హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులను టప్పాచబుత్ర పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. జిర్రాకు చెందిన అమేర్ హుస్సేన్(28)కు మంగళ్‌హాట్‌కు చెందిన ఆజాం బాల్య మిత్రుడు. రౌడీషీటర్ అయిన ఆజాం కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన అనీస్ హత్యకేసులో నిందితుడు. ఇదిలా ఉండగా వారం రోజుల కిందట గంగాబౌలికి చెందిన మహ్మద్ సాజీద్ అనే వ్యక్తి ఆజాం చిరునామా చెప్పాలంటూ అమేర్ హుస్సేన్ వద్దకు వచ్చాడు. ఈ విషయంలో ఇరువురి మధ్యన వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో అమేర్ హుస్సేన్ మహ్మద్ సాజీద్‌ను కొట్టాడు. దీంతో మహ్మద్ సాజీద్ తన స్నేహితులతో కలిసి ఈనెల 10న మారణాయుధంతో వచ్చి హత్యాయత్నం చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తండ్రి, మిత్రుడి సాయంతో హత్యాయత్నం నుంచి తప్పించుకున్న విషయాన్ని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈనెల 11న రాత్రి జిర్రాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహ్మద్ సాజీద్(22), సయ్యద్ దస్తగిరి (26), మహ్మద్ అమ్జాద్ (25), షేక్ రియాజ్ (27)ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రం తెలంగాణ



గుడిమల్కాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుల సమావేశం

గోల్కొండ: సీఎం కేసీఆర్ హయాంలో దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గం అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో కార్వాన్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మిత్ర కృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా కర్ఫ్యూ విధించలేదని, అదే విధంగా కరెంటు కటింగ్‌లు, తాగునీటి కటకటలు లేవన్నారు. కేసీఆర్ సమయోచిత నిర్ణయాలు, పాలన సమర్థతతోనే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. కార్వాన్‌లో ఈ సారి తాను కచ్చితంగా గెలుస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, తూమ్‌కుంట అరుణ్‌కుమార్, శివరాత్రి రాములు, పద్మ తదితరులున్నారు.

గోషామహల్ బీఆర్ఎస్ టికెట్ మరాఠాలకు కేటాయించాలి



కవితకు బయోడేటాను అందజేస్తున్న దిలీప్ ఘనాటే

సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ టికెట్‌ను మరాఠాలకు ఇవ్వాలని దిలీప్ ఘనాటే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉద్యమ కాలం నుంచి తెలంగాణ ఉద్యమంలో మరాఠాలు కీలకపాత్ర వహించారన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో ఎక్కువశాతం మరాఠాలు ఉన్నందునా మరాఠా సామాజిక వర్గానికి చెందిన తనకు టికెట్ కేటాయించాలని ఎమ్మెల్సీ కవితను కోరినట్లు తెలిపారు. దీని అధిష్టానం సానుకూలంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అధిష్టానం టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గోషామహల్ విజయాన్ని కేసీఆర్‌కు కానుకగా ఇస్తానన్నారు.

బాధితురాలికి చేయూతనందించాలి



వీసీకి వినతిపత్రం సమర్పిస్తున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేందర్ తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ మహిళా యూనివర్సిటీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని హాస్టల్ విద్యార్థులకు వంట చేస్తుండగా ప్రమాదానికి గురైంది. వివరాల ప్రకారం.. మహిళా విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కార్మికురాలు విజయలక్ష్మి గురువారం వంటచేస్తూ ప్రమాదానికి గురైంది. అయితే యూనివర్సిటీ అధికారులు ప్రమాదానికి గురైన విజయలక్ష్మికి ఎలాంటి సాయం అందించలేదని ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహేందర్ మండిపడ్డారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ విజ్జులతకు వినతిపత్రం సమర్పించారు. విజయలక్ష్మికి వైద్య ఖర్చులన్ని యూనివర్సిటీ భరించాలని వీసీని కోరడంతో ఆమె సానుకూలంగా స్పందించి రూ.10 వేల చెక్కును ఖర్చుల కోసం ఇచ్చారని మహేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సీతారామ్, ఉపాధ్యక్షులు అనసూయ, నాయకులు చంద్రమౌళి, రమేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు



విజయనగర్‌కాలనీ రవీంద్రభారతి పాఠశాలలో..



కేటీఎస్ స్కూల్‌లో..

గోల్కొండ: బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఇష్టమైన పండగ అని రవీంద్ర భారతీ పాఠశాలల మెహిదీపట్నం జోన్ డీన్ ప్రియామనీష్ అన్నారు. గురువారం మురాద్‌నగర్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ అంటే పూల పండుగ అని, తెలంగాణలో దశాబ్దాలుగా ఈ పండుగ జరుపుకుంటున్నారన్నారు. ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి, డీఏ మధు తదితరులు పాల్గొన్నారు.

విజయనగర్‌కాలనీలో..

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ రవీంద్ర భారతి పాఠశాలలో చిన్నారులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులతో వచ్చి బతుకమ్మను అలంకరించి బతుకమ్మ పాటలకు అనుగుణంగా ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రియామనీష్, ప్రిన్సిపల్ నూరీన్ ఫాతిమా, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్ర విద్యాలయంలో..

అబిడ్స్: అబిడ్స్ కట్టెల మండిలోని ఆంధ్ర విద్యాలయ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను చాటేవిధంగా వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చల్లా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..తమ పాఠశాలలో విద్యార్థులకు చిన్నప్పటి నుంచే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు నేర్పాలనే ఉద్దేశంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, హేమ, ప్రమీళ, సునిత, జ్యోతి, ప్రియా పాల్గొన్నారు.

జియాగూడలో..

జియాగూడ: బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమని జియాగూడ విద్యశ్రీ హైస్కూల్ డైరెక్టర్ శ్యామ్‌వెరా అన్నారు. గురువారం స్కూల్ ప్లే గ్రౌండ్‌లో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. చిన్నారి విద్యార్థులు వివిధ మాతేశ్వరీల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలవగా విద్యార్థినులు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సునిత శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఎస్ స్కూల్‌లో వేడుకలు

బతుకమ్మ సంబరాలు తెలంగాణ పండుగల్లో పెద్దపీట వేయిస్తాయని జియాగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు నరహరిచారి, కార్వాన్ నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్ అన్నారు. గురువారం జియాగూడ కేటీఎస్ స్కూల్‌లో ఏర్పాటైన బతుకమ్మ వేడుకలకు వారు హాజరు కాగా స్కూల్ యాజమాన్యం వారిని ఘనంగా సన్మానించింది.



వేడుకల్లో ఆంధ్ర విద్యాలయ ఉపాధ్యాయులు



విద్యశ్రీ స్కూల్‌లో..



మురాద్‌నగర్ ఆర్‌బీఎస్‌లో..